

అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి : సిఐటియు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అంగన్వాడీ కార్యకర్తలకు ఉద్యోగభద్రత కల్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు హరీంద్రనాథ్ శర్మ డిమాండ్ చేశారు. మంగళవారం సిఐటియు కార్యాలయంలో తంబళ్ళపల్లి ప్రాజెక్టు అంగన్వాడీ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరారు. అంగన్వాడీ కార్యకర్తలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, అందరికీ ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాలకు అద్దె సక్రమంగా కట్టాలని, అలవెన్సులు, టిఎ, డిఎలు పూర్తిగా చెల్లించాలని పేర్కొన్నారు. మదనపల్లి ప్రాజెక్టు నాయకులు రాజేశ్వరి, మధురవాణి మాట్లాడుతూ ఉన్నతాధికారులు, రాజకీయనాయకుల ఒత్తిళ్లను అధిగమించి తమ డ్యూటీ చేస్తున్నామని, వీరికి యూనియన్ అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వం సృష్టిస్తున్న సమస్యలు పరిష్కరించుకొనేందుకు యూనియన్ను బలోపేతం చేయాలని కోరారు. మాతా శిశు సంరక్షణకు ప్రభుత్వం మరిన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. అనంతరం ప్రాజెక్టు కమిటీ గౌరవాధ్యక్షులుగా చాంద్‌బీ, అధ్యక్షులుగా కరుణ, కార్యదర్శిగా శ్రీవాణి, కోశాధికారిగా స్వరూపలతో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

ఇసుక మేట.. గుండెకోత



అన్నమయ్య ప్రాజెక్టు నిర్వాసితులకు కన్నీటి వరద కొనసాగుతోంది. అధికారుల నిర్లక్ష్యం, రాజకీయ నాయకుల అలక్ష్యం వెరసి తమ కష్టాలకు కారణమనే వాదన వినిపిస్తోంది. వరద విలయానికి ఏడాది గడిచినప్పటికీ తమ పొలాల్లో తిష్ట వేసిన ఇసుక మేటలను తొలగించకపోవడంలో తాత్సారం, భూముల హద్దులు చెరిగిన నేపథ్యంలో భూసర్వే చేపట్టకపోవడంతో పంటల సాగుకు యోగ్యంకాని దుస్థితి దాపురించింది. ఫలితంగా సుమారు 1000 ఎకరాల్లో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైంది. వ్యవసాయం లేకపోవడంతో కూలి పనులు చేసుకోవడానికి పనులు లేకపోవడం, జిల్లా అధికార యంత్రాంగం కనీసం ఉపాధి హామీ పనులు కల్పించకపోవడం వెరసి నిర్వాసితుల దౌర్భాగ్య పరిస్థితులపై ప్రజాశక్తి ప్రత్యేక కథనం.

- అన్నమయ్య ప్రాజెక్టు నిర్వాసిత గ్రామాల్లో ఎటుచూసినా ఇసుకమేటలే
- 927 ఎకరాల ఫ(పొ)లాలు ఛిద్రం
- 'రాజకీయం' గుప్పిట్లో విలవిల
- నేటికీ తేరుకోని నిర్వాసితులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జవాద్ ధాటికి అన్నమయ్య రిజర్వాయర్ అస్థిత్వం గల్లంతైంది. అన్నమయ్య జిల్లాలోని రాజంపేట-నందలూరు మండలాల పరిధిలోని పులపుత్తూరు, మందపల్లి, తోగూరుపేట, రామచంద్రాపురం, గుండ్లూరు, శేషమాంబపురం గ్రామాలు మొదలుకుని సుమారు 19 గ్రామాలను వరద చుట్టు ముట్టేసింది. ఫలితంగా జన, ధన, ప్రాణ, ఆస్తి నష్టాలు వెరసి ఆపార నష్టం వాటిల్లింది. వరద విలయం ధాటికి పంట పొలాల్లో పెద్దఎత్తున ఇసుక మేటలు వేయడం వేదనకు గురిచేస్తోంది. మేటలను తొలగించడానికి ఏడాది దాటినప్పటికీ మందపల్లి నిర్వాసిత గ్రామంలో ఇసుకదిబ్బలు తోయడం మినహా ఇసుక దిబ్బల తరలింపు, భూముల సరిహద్దుల ఏర్పాటు వంటి పునరుద్ధరణ పనులు చేపట్టలేదు. వరద ప్రవాహం బారిన పడిన గ్రామాల్లో ఒకటైన పులపుత్తూరు పొలాల్లో నేటికీ ఇసుకమేటలు



వ్యవసాయ పొలాల్లోని ఇసుక మేటలు

తొలగింపునకు నోచుకోవడం లేదని ఉప సర్పంచ్ కృష్ణంరాజు దగ్గర నుంచి నిర్వాసితుల్లో ఎవరిని కదిలించినా కళ్లలో కన్నీరు సుడులు తిరుగుతున్నాయి. ఈ నెల 19వ తేదీతో మరుసటి ఏడాదిలోకి అడుగుపెడుతున్నప్పటికీ ఇసుకమేటలు తొలగించకపోవడం, నూతన పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయకపోవడం, పోషణకు సంబంధించి ఉపాధి హామీ వంటి పనులు కల్పించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. పంటల సాగుకు అవసరమైన పెట్టుబడులకు ఇబ్బందులు తలెత్తుతుండడంతో ఏమీ చేయలేని నిస్సహాయ పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.

వెయ్యి ఎకరాల్లో పంట నష్టం?

అన్నమయ్య నిర్వాసిత గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. 927 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. ఏడాది సమయం గడిచినప్పటికీ పునరుద్ధరణ పనులు చేపట్టకపోవడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. మొదటగా మందపల్లి, శేషమాంబపురం గ్రామాల్లో 150 ఎకరాల పొలాలు కోతకు గురికావడం, మరో 370 ఎకరాల్లో ఇసుక మేటలు వెరసి 520 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. గుండ్లూరులో 50 ఎకరాల్లోని పొలాలు కోతకు గురికావడం, 95 ఎకరాల్లో ఇసుక మేటలు వెరసి 158 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లడం గమనార్హం. పులపుత్తూరులో 100 ఎకరాల్లో పంట కోతకు గురికావడం, మరో 150 ఎకరాల్లో వెరసి 250 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లడం ఆందోళన కలిగిస్తోంది. గుండ్లూరులో 220 ఎకరాల్లో పంటలు సాగు చేసేశారు. వరద విలయం దాటికి పొలాల మృత్తికా స్వరూపం మారిపోవడంతో సాగుకు యోగ్యం కాని పరిస్థితి ఏర్పడిందని నిర్వాసిత గ్రామాల రైతులు వాపోతున్నారు. పులపుత్తూరు నిర్వాసిత గ్రామానికి చెందిన నిర్వాసితుడు బియ్యపు శంకర్‌రెడ్డి మాట్లాడుతూ తమ గ్రామంలోని నిర్వాసితులకు ఉపాధి హామీ పథకం పనులు అమలు చేయకపోవడంతో దళిత సామాజిక వర్గం మొదలుకుని ఇతర సామాజిక వర్గాల్లో తీవ్ర నిర్వేదం నెలకొందని పేర్కొనడం నిర్వాసితుల దుర్భర పరిస్థితికి అద్దం పడుతోంది.

'రాజకీయం' గుప్పిట్లో నిర్వాసితులు

అన్నమయ్య నిర్వాసితులు తమ పరిస్థితులపై గొంతెత్తితే ఇబ్బందులు తప్పడం లేదని తెలుస్తోంది. ఇద్దరు ప్రజా ప్రతినిధుల గ్రూపుల్లో చేర్చి ఇబ్బందులు పెడుతున్న కారణంగా ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడిందని మదనపడుతున్నామని పలువురు నిర్వాసితులు పేర్కొంటున్నారు. నోరు విప్పితే గ్రూపుల మధ్య ముద్ర పడుతుందని, బయటికి చెప్పడానికి జంకుతున్నామని సుబ్బమ్మ అనే నిర్వాసితురాలు పేర్కొనడం గమనార్హం. దాతలు వేసిన రేకుల షెడ్డుతో కరెంటు షాక్ కొడుతోందని, తమ పిల్లలు పట్టుకుంటే పరిస్థి తేమిటని వాపోతున్నప్పటికీ పట్టించుకునే నాధుడే కరువయ్యారని మరో మహిళ వాపోతుండడం గమనార్హం. ఏడాది గడిచినప్పటికీ కొనసాగుతున్న దుర్భర పరిస్థితుల నేపథ్యంలో కలెక్టర్ జోక్యం చేసుకుని తక్షణమే ఉపాధి హామీ పనులు కల్పించడం, పొలాల్లో తిష్ట వేసిన ఇసుక దిబ్బలను తొలగించడం, భూముల సరిహద్దులు రూపు మాసిన నేపథ్యంలో సర్వేయర్లతో కొలతలు వేయించి సాగును ప్రోత్సహించాల్సి ఉంది. దీనిపై అన్నమయ్య జిల్లా వ్యవసాయాధికారిని సంప్రదించగా తాను అందుబాటులో లేనని పేర్కొనడం గమనార్హం.

ఆధార్ అనుసంధానం పక్కాగా చేపట్టాలి

- కలెక్టర్ గిరీష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో ఓటర్ కార్డులకు ఆధార్ అనుసంధానం కార్యక్రమం పక్కగా చేపట్టాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో స్పందన గ్రీవెన్స్, నవరత్నాలు పేదలందరికీ ఇల్లు- ఇంటి నిర్మాణాల పురోగతి, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. జిల్లాలో ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం చేయడానికి 6-బి ఫారం కలెక్షన్స్ వందశాతం పూర్తి చేయాలన్నారు. ఇందుకు సంబంధించి 6- బిఫామ్ జాగ్రత్తగా పరిశీలించి తప్పులు లేకుండా చూడాలన్నారు. ఓటర్ జాబితాలో నమోదు నిమిత్తం వచ్చిన క్లైమ్స్, అభ్యంతరాలు పెండింగ్ లేకుండా క్లియర్ చేయాలన్నారు. ఓటరు నమోదు కార్యక్రమాలకు సంబంధించి బిఎల్ఒలుగా విఆర్ఒ, పంచాయతీ సెక్రటరీ, సచివాలయ మహిళాపోలీస్(మహిళా, శిశు సంరక్షణ కార్యదర్శి), వెల్ఫేర్ సెక్రటరీ, ఎఎన్ఎంలను నియమించి కార్యక్రమం వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన ప్రతి పనీ పెండింగ్‌లో లేకుండా సంబందితా ధికారులం దరూ సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా స్పందన కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. స్పందనలో వచ్చిన అర్జీలు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడూ క్లియర్ చేయాలన్నారు. అధికారులు స్పందన అర్జీలను సీరియస్ గా తీసుకోవాలన్నారు. ప్రతి సోమవారం స్పందనలో వచ్చిన అర్జీలను శనివారం లోపల క్లియర్ అయ్యేటట్లు చూడాల న్నారు. స్పందనలో ఎక్కువగా భూ సమస్యలు, పంచాయతీరాజ్ శాఖ, సివిల్ సప్లైస్, డిపిఒ, పబ్లిక్ హెల్త్, తదితర శాఖలకు సంబంధించిన సమస్యలు వస్తుంటాయని వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నవరత్నాలు పేదలందరికీ ఇల్లు కార్యక్రమంలో భాగంగా పేదలకు మంజూరైన ఇళ్లన్నీ గడువు లోపల పూర్తి చేయా లన్నారు. లబ్ధిదారులకు సకాలంలో ఇసుక, సిమెంటు, స్టీల్ ఇవ్వడం జరుగుతుందని ఇళ్ల నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలన్నారు. జగనన్న హౌసింగ్ లేఅ వుట్లలో అన్ని మౌలిక వసతులు ఉండేటట్లు చూడాల న్నారు. ప్రతి లే అవుట్‌లో తప్పకుండా నీరు, విద్యుత్ సౌక ర్యం కల్పించాలన్నారు.జిల్లాలోని మండలాల వారీగా ఎస్సీ ఎస్టీ కాలనీలో శ్మశాన వాటికలకు స్థలాలు గుర్తిం చాలని సంబంధిత తహశీల్దార్లకు సూచించారు. బరియల్ గ్రౌండ్ ఆయా కాలనీలకు దగ్గరలోనే ఉండేట ట్లు చూడాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను పెండింగ్ లేకుండా త్వరితగతిన పరిష్కరించాలన్నారు. వైఎస్ఆర్ చేయూత, జగనన్నతోడు, జగనన్న విద్యాదీవెన, వాహనమిత్ర ఇకెవైసి పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు. కల్యాణమస్తు కార్యక్రమానికి సంబంధించి దరఖాస్తులు ఎక్కువగా రాలేదని ఈ కార్యక్రమంపై ఎస్సీ ఎస్టీ మైనార్టీలలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జయంట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా, డిఆర్ఒ సత్యనారాయణ, ఆర్డీవో రంగస్వామి, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, హౌసింగ్ పీడీ శివయ్య పాల్గొన్నారు.

క్లాప్ డ్రైవర్లకు కనీస వేతనం చెల్లించాలి : 'సిటు'

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

క్లాప్ డ్రైవర్లకు కనీస వేతనం రూ.18,500 ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పట్టుపరిశ్రమ కేంద్ర ఆవరణలో క్లాప్ డ్రైవర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏడు జిల్లాలలోని మున్సిపాల్టీలలో ఇళ్ల నుంచి చెత్త సేకరణ, తరలింపునకు క్లాప్ డ్రైవర్లను కాంట్రాక్ట్ పద్ధతిన పని చేస్తున్నారని చెప్పారు. కాంట్రాక్టు తీసుకున్న రెడ్డి ఎంటర్‌ప్రైజర్ యాజమా న్యానికి పలుమార్లు సమస్యలు విన్నవించినా పట్టించు కోలేదని వాపోయారు. కావున ఈనెల 16 నుంచి డ్రైవర్లు విధులు బహిష్కరిస్తున్నారని చెప్పారు. క్లాప్ డ్రైవర్ల యూనియన్ నాయకులు ఎ. నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుత ధరలు విపరీతంగా పెరిగినందున కనీస వేతనం రూ.18,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలతోపాటు, ఇఎస్ఐ, పిఎఫ్ వర్తింపు, ఇఎస్ఐ, క్యాజువల్ లీవులు వర్తింపజేయాలని కోరారు. ప్రమాద బీమా ఇవ్వాలన్నారు. అనంతరం సూపర్‌వైజర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో అబ్దుల్లా, నరేంద్ర, అయ్యప్ప, చంద్రశేఖర్, లోకేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి రామాంజులు

భూసేకరణ త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - రాయచోటి

ప్రపంచంలోనే ప్రఖ్యాతిగాంచిన మంగంపేట బైరై టిస్ ప్రాజెక్టుకు సంబంధించి భూసే కరణ వేగవంతం చేయాలని అధికా రులను కలెక్టర్ గిరీష ఆదేశిం చారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో మంగంపేట బైరటిస్ ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ వేగవంతం పురోగతిపై రాజంపేట ఆర్‌డిఒ, సంబంధిత అధికారులతో కలెక్టర్ గిరీష సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఇప్పటి వరకు ఎన్ని ఎకరాలు భూ సేకరణ చేశారు, ఇంకా ఎన్ని ఎకరాలు చేయాలి,ఆర్అండ్ఆర్‌కు ఎన్ని కోట్లు ఖర్చు చేశారు, ఇప్పటి వరకు నష్ట పరిహారం ఎంత ఇచ్చారు, ఎంత పేమెంట్ జరిగిందో ఆ వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అర్హులైన వారు నష్ట పోకుండా చూడాలని చెప్పారు. అన్ని ఒరిజినల్ రికార్డులు పరిశీలించాలన్నారు. ఆర్ అండ్ ఆర్ క్లెయిమ్స్ త్వరగా క్లియర్ చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. 15 రోజుల్లోగా ఈ పనులను పూర్తి చేయాలని రాజంపేట ఆర్‌డిఒ, ఓబులవారిపల్లి తహశీల్దార్‌ను కలెక్టర్ సూచిం చారు. సమీక్షలో రాజంపేట ఆర్‌డిఒ కోదండరామిరెడ్డి, ఓబులవారిపల్లి తహశీల్దార్, అధికారులు పాల్గొన్నారు.



జీపు డ్రైవర్ల యూనియన్ నూతన కమిటీతో సిఐటియు నాయకులు

జీపు డ్రైవర్ల యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-చిట్వేల్

స్థానిక సిఐటియు కార్యాలయంలో మండల నాయకులు నాని అధ్యక్షతన ఎపి ప్రయివేట్ ట్రాన్స్‌ఫోర్ట్ జీపు డ్రైవర్ల యూనియన్ నూతన కార్యవర్గాన్ని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల అనేక సాకులు చెబుతూ పెనాల్టీలు వేసి డ్రైవర్లను ఇబ్బందికి గురి చేస్తున్నారని తెలిపారు. డీజిల్, పెట్రోల్ ధరలు అధికంగా పెరగడంతో డ్రైవర్ల జీవితాలు అగమ్య గోచరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైవర్‌గా జీవనాన్ని కొనసాగిస్తున్న వారిని గమనించి ప్రభుత్వం ఇంటి స్థలాలు ఇవ్వాలని, గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ జిల్లా కార్యదర్శి పందికాళ్ళ మని, కెవిపిఎస్ డివిజన్ కన్వీనర్ ఓబిలి పెంచలయ్య కలిసి గౌరవ అధ్యక్షులుగా యాదూరి సుజాతమ్మ, అధ్యక్షులుగా ఆకేపాటిశంకర్‌రెడ్డి ప్రధాన కార్యదర్శిగా కాటం శెట్టిసుబ్రహ్మణ్యం, కోశాధికారిగా కస్తూరి గణేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్.అక్బర్ బాషా, వర్కింగ్ సెక్రటరీగా, షేక్ గౌస్ బాషా, ఉపాధ్యక్షులు కందుల సుబ్బయ్య, కోలే సుధాకర్, ముండ్లపల్లి ఈశ్వరయ్య, గౌస్ లడ్డు, సహాయ కార్యదర్శులుగా కొక్కింటి సుబ్రహ్మణ్యం, తుమ్మల శివప్రసాద్, తదితరులను ఎనుకున్నారు.

అంగన్వాడీలకు పెండింగ్ వేతనాలివ్వాలి

ప్రజాశక్తి- గాలివీడు

అంగన్వాడీలకు 9 నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి ఎం. లక్ష్మిదేవి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో అంగన్వాడీ కార్మికులు, ఆయాల సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 9 నెలలనుంచి గ్యాస్, కూరగాయల బిల్లులురాలేదని తెలిపారు. 2 నెలలుగా పూర్తిగా జీతం కూడా రానందున టీచర్లు, ఆయాలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అప్పు చేసి సెంటర్ నడుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమని వాపోయారు. జులై నుంచి సెంటర్ అద్దెలు రాలేదని తెలిపారు. యాప్‌ల పని ఎక్కువ ఉందని, కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అంగన్వాడీ మండల నాయకులు రమణమ్మ, వెంకటరమణమ్మ, కుమారి, నాగేశ్వరి, రత్నమ్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అంగన్వాడీ యూనియన్ నాయకులు

మల్లికార్జునపై కాల్పులకు పాతకక్షలే కారణమా?

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు మండల రైతు భరోసా కేంద్రాల చైర్మన్ చింతల మల్లికార్జునపై గుర్తుతెలియని వ్యక్తులు నాటు తుపాకీతో రెండు రౌండ్లు కాల్పులు జరిపిన సంఘటన చోటు చేసుకుంది. సోమవారం రాత్రి మూత్ర విసర్జన కోసం ఆయన మల్లగురువాండ్లపల్లిలోని తన ఇంటి బయటకు వచ్చాడని, అదేసమయంలో అతని ఇంటి సమీపంలోని మామిడి తోట నుంచి గుర్తు తెలియని వ్యక్తులు నాటు తుపాకీతో మొదట రౌండ్ కాల్పులు జరిపారు. విషయం గ్రహించిన మల్లికార్జున అప్రమత్తమై ఇంటిలోకి వెళ్లే ప్రయత్నం చేస్తుండగా మరోసారి అతనిపై కాల్పులు జరిపారు. ఈ ఘటనలో అతని కుడి కాలుకు తీవ్ర గాయమై జోరుగా కేక పెడుతూ ఇంటిముందు పడిపోయాడు. ఇంట్లోంచి భర్త అరుపు విన్న అతని భార్య రామ లక్ష్మమ్మ ఇంటి బయటకు పరుగున వచ్చింది. రక్త గాయంతో కిందపడి ఉన్న భర్తను చూసి భయంతో ఆమె కేకలు పెట్టి బోరన విలపించింది. అదివిన్న గ్రామస్తులు పరుగున అక్కడికి చేరుకున్నారు. కుటుంబ సభ్యులు గ్రామస్తుల సహకారంతో అతన్ని హుటాహుటిన పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి పంపారు. సమాచారం అందుకున్న పీలేరు అర్బన్ సిఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐ నరసింహుడు ఆసుపత్రికి చేరుకుని, జరిగిన ఉదంతాన్ని బాధితుడు, అతని బంధువుల ద్వారా సేకరించారు. ఆ వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి అక్కడి పరిస్థితులపై విచారణ చేపట్టారు. ఇంటి ముందు పడి ఉన్న నాటు తుపాకీ గుండ్లు, రక్తపు మరకలను కూడా గుర్తించారు. గ్రామస్తుల విచారించి విషయం తెలుసుకున్నారు. గ్రామంలో ఎలాంటి అల్లర్లు జరగకుండా ముందస్తు చర్యలో భాగంగా అక్కడ పోలీసు పికటింగ్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మల్లికార్జునకు అతని దాయాదులతో ఉన్న పాత గొడవలే ఈ కాల్పులకు కారణమై ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మల్లికార్జునపై గతంలోనూ ఓ సారి అతని దాయదులు కత్తులతో దాడి చేసిన ఘటనలో ఆయన గాయపడి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నట్లు పోలీసుల విచారణలో గ్రామస్తులు తెలియజేశారు.



గాయపడిని మల్లికార్జునను పరిశీలిస్తున్న సిఐ

కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వాలు

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-కడప అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముఠా కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమా మహేశ్వరరావు విమర్శించారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఎపిఎస్‌బిసిఎల్, ఐఎంఎఫ్ఎల్ డిపో హమాలీ యూనియన్ రాష్ట్ర నాల్గవ మహాసభను నిర్వహించారు. ముందుగా మహాసభల జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఇటీవలి కాలంలో మృతి చెందిన కార్మికులకు, ప్రముఖులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ అన్ని రకాల ధరలు పెరిగిపోయిన నేపథ్యంలో హమాలీ కార్మికులకు ఎగుమతి , గుమతి కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. హెల్త్ ఇన్సూరెన్స్, ఇఎస్ఐ, పిఎఫ్, పెన్షన్ హమాలీలకు ఇస్తామని ఏ ప్రభుత్వాలు హామీ ఇవ్వలేదని విమర్శించారు. కరోనా కాలంలో ముఠా కార్మికులను ప్రభుత్వాలు విస్మరించాయని ఆవేదన వ్యక్తం చేశారు. మృతి చెందిన వారిని ఆదుకోలేదని పేర్కొన్నారు. ముఠా కార్మికులను కలుపుకొని పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని, కరోనా సమయంలో మృతి చెందిన హమాలీ కార్మికుల కుటుంబాలను ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. హక్కులను కాలరాస్తూ యాజమాన్యాలకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకుంటామని పేర్కొన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. అసంఘటిత కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని చెప్పారు. మహాసభల్లో భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ముఠా కార్మికుల ద్వారా కోట్ల రూపాయలు ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని చెప్పారు. కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుబ్బారెడ్డి, కొండలరావు మాట్లాడుతూ మూడు సంవత్సరాలకు ఒకసారి మహాసభ నిర్వహించుకుంటామని తెలిపారు. జగన్ ప్రభుత్వం వచ్చాక నూతన మద్యం పాలసీ తీసుకువచ్చారని చెప్పారు. ఎన్నికలలో మద్య నిషేధం అమలు చేస్తే హమాలీ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగాలు చూపించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 2,100 మంది పనిచేస్తున్నారని పేర్కొన్నారు. మద్య నిషేదాన్ని విధిస్తే వీరందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సభలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రసాద్‌రావు, నాయకులు నూర్‌మొహమ్మద్, సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులురెడ్డి, నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, నాయకులు సుంకర రవి, రాష్ట్ర వ్యాప్తంగా హమాలీ కార్మికులు పాల్గొన్నారు.



హమాలీల మహాసభలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

నేడు గృహ నిర్మాణ శాఖ మంత్రి రాక

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ బుధవారం రాయచోటికి రానున్నారని కలెక్టరు గిరిష ఒక ప్రకటనలో తెలిపారు. 16న ఉదయం 6.30 గంటలకు రాయచోటికి చేరుకుని 8.30 గంటలకు నారాయణరెడ్డిపల్లెలోని జగనన్న లేవుట్ ను పరిశీలిస్తారు. 9.30 నుంచి 11 గంటల వరకు కలెక్టరేట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి కడప విమానాశ్రయం చేరుకుని అక్కడ నుంచి మధ్యాహ్నం 2.40 గంటలకు విజయవాడకు చేరుకుంటారని పేర్కొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుపై డిఎస్‌పి విచారణ

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

రెండు రోజుల క్రితం మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్‌రెడ్డి మరో ఐదుగురిపై శివనారాయణ, నాగరత్నమ్మ పెట్టిన కేసుపై మంగళవారం డిఎస్‌పి శ్రీధర్ విచారించారు. రమేష్ కుమార్‌రెడ్డికి శివనారాయణ భూమి వివాదం గురించి బాధితులను డిఎస్‌పి విచారించారు. తహశీల్దార్ నాగ ప్రసన్నలక్ష్మి, జిల్లా సర్వేయర్ స్థలానికి చేరుకొని భూమిని సర్వే చేయించారు.



బాధితులను విచారిస్తున్న డిఎస్‌పి శ్రీధర్



అన్నదానం చేస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి : 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని టిడిపి సీనియర్ నాయకులు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆకాంక్షించారు. మంగళవారం కార్తీక మాసాన్ని పురస్కరించుకుని హత్తరాల కామాక్షి సమేత త్రేతేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో టిడిపి పార్లమెంట్ నిర్వాహక కార్యదర్శి కొవ్వూరు సుబ్రహ్మణ్యం నాయుడు, నాయకులు శివకుమార్, నాగేందర్, బంటుమిల్లి వినోద్‌రెడ్డి, రవిశేఖర్, వెంకటేష్ యాదవ్, శివనాయుడు, శివప్రసాద్ నాయుడు, శేషారెడ్డి అమీర్, విజయ్ కుమార్, రాజు, గురు పాల్గొన్నారు.



బురదమయంగా మారిన కొత్త కోడూరు రోడ్డు

కొత్త కోడూరు మార్గం బురదమయం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

వర్షం పడిందంటే ప్రధాన రహదారి నుంచి కొత్త కోడూరుకు వెళ్లే మార్గం బురద మయంగా మారుతుంది. ఆ ప్రాంతానికి వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల ఎర్ర మట్టితో మట్టి రోడ్డు వేశారు. వర్షం పడిందంటే బురదగా మారి నడిచి వెళ్లేందుకు వీలు లేకపోగా వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. వర్షం పడిన ప్రతిసారి ఇలాంటి పరిస్థితి నెలకొనడంతో కొత్తకోడూరు ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకొని పక్కా రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి-నందలూరు

సచివాలయం ఉద్యోగులు సమయపాలన పాటించాలని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ అన్నారు. మంగళవారం నాగిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని రెండు, మూడు సచివాలయాలను ఇఒపిఆర్‌డి డి.వి.ప్రసాద్‌తో కలిసి తనిఖీ చేశారు. హాజరు పట్టిక, ఇతర రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమయపాలన విధిగా పాటించాలన్నారు. ఎట్టిపరిస్థితిలోనూ పని నిమిత్తం వెళితే రిజిస్టర్‌లో తెలపాలని పేర్కొన్నారు. అలా కాకుండా వ్యవహరిస్తే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. నారాయణరాజుపేట జగనన్న కాలనీలో విద్యుత్ సౌకర్యం, నీటి సౌకర్యం ఏర్పాటుకు సంబంధించి అధికారులతో మాట్లాడి త్వరగా సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం జగనన్న కాలనీలో కొంతమంది బేస్‌మట్టాలు వేసినప్పటికీ మిగిలిన వారు కూడా ఇళ్ల నిర్మాణం చేపట్టేలా ఇంజినీరింగ్ అధికారులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అనర్హులకు కాకుండా అర్హులకు అందేలా చూడాలన్నారు. తద్వారా ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని పేర్కొన్నారు. సచివాలయం ద్వారా అందించే సర్టిఫికెట్ల విషయంలో దృష్టి సారించి తప్పులు లేకుండా చూడాలన్నారు. డిజిటల్ వెల్ఫేర్ అసిస్టెంట్లు బాగా పనిచేసినప్పుడే మనకు మంచి పేరు వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.



కరాటే సర్టిఫికెట్లతో విద్యార్థులు

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని విజయ భారతి ఇంగ్లీషు మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.సేతు ఆకాంక్షించారు. కరాటే విద్యను అభ్యసించడం వల్ల ఆరోగ్యం, ఆత్మస్థైర్యం, ఆత్మవిశ్వాసం, ముఖ్యంగా క్రమశిక్షణ అలవడుతుందని పేర్కొన్నారు. విపత్కర పరిస్థితిలో మనల్ని మనం రక్షించుకోవడానికి ఈ విద్య ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ప్రశంసా పత్రాలు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. కరాటే మాస్టర్ డాక్టర్ ఎఆర్.సురేష్, కరాటే కోచ్ మణిసాయిలను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలిటెక్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయండి

కలికిరి: పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించే పాలిటెక్ ఫెస్టివల్ ను విజయవంతం చేయాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండు రోజులపాటు పాలిటెక్ ఫెస్టివల్ నిర్వహిస్తామని ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పాల్గొని వారి వారి సామర్థ్యాన్ని బట్టి ప్రాజెక్టు వర్క్‌లను డిస్ప్లే చేస్తారని పేర్కొన్నారు. ఉత్తమ నైపుణ్యం కనపరిచిన విద్యార్థులకు జడ్జిల ద్వారా మొదటి, రెండవ బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ గిరీష, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

గెస్ట్‌హౌస్ పనులు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణంలోని సాయి ఇంజినీరింగ్ కళాశాల ఎదురుగా నిర్మిస్తున్న గెస్ట్ హౌస్ నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి, భవనాన్ని ఈ నెల చివరిలోగా అప్పగించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ గిరీషా పిఎస్ ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం గెస్ట్ హౌస్ భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. టైల్స్ పనులు పూర్తి చేశామని, ఈ నెల చివరిలోగా అన్ని పనులు పూర్తి చేసి అప్పగిస్తామని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. గెస్ట్ హౌస్ ముందు భాగంలో మట్టి చదును పనులను వేగవంతం చేయాలన్నారు. గెస్ట్ హౌస్ వచ్చేందుకు రోడ్డు పనులు కూడా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్ అండ్ బి డిఈ సురేష్ నాయక్, రాయచోటి తహాశీల్దార్ రవిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.



గెస్ట్ హౌస్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీష

19 నుంచి జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గిరీష, జెసి తమీమ్ అన్సారీయా

ప్రజాశక్తి - రాయచోటి

ఈనెల 19 నుంచి 21 వరకు జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాలు ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందని కలెక్టర్ గిరీష పిఎస్ తెలిపారు. ఈ మేరకు జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాలు పోస్టర్లను జెసి తమీమ్ అన్సారీయాతో కలిసి కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 19, 20, 21 తేదీలలో తిరుపతి మహతి కళాక్షేత్రంలో జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాలు అత్యంత ఘనంగా నిర్వహిస్తారన్నారు. ఇందులో 'జోనల్ స్థాయి పోటీలు' కు సంబంధించి తిరుపతి, నెల్లూరు, చిత్తూరు, అన్నమయ్య, వైయస్సార్ కడప, సత్యసాయి, అనంతపురం, నంద్యాల, జిల్లాల కళాకారులకు తిరుపతి మహతి కళాక్షేత్రంలో నిర్వహిస్తారన్నారు. జోనల్ స్థాయిలో విజేతలైన వారికి డిసెంబర్ 19, 20 తేదీల్లో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్రస్థాయి పోటీ నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రతి విభాగంలో జోనల్ స్థాయి విజేతలకు గ్రూప్‌కు రూ. 25 వేలు, సోలోకు రూ. 10 వేలు, విజేత గ్రూపునకు రూ.లక్ష, సోలో గ్రూపునకు రూ. 50 వేల నగదు బహుమతలు ఇస్తారన్నారు. ఉచిత భోజన సౌకర్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి నాగభూషణం, పర్యాటక సిబ్బంది చంద్ర పాల్గొన్నారు.

ఫిబ్రవరి నాటికి నాడు-నేడు పనులు పూర్తి : డిఇఒ

ప్రజాశక్తి-పీలేరు

2023 ఫిబ్రవరి చివరికల్లా నాడు-నేడు రెండో దశ పనులను పూర్తి చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక కోటపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసి తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడు రెండవ దశ పనుల కోసం జిల్లాలో 1042 పాఠశాలలను ఎంపిక చేశామన్నారు. ఇందు కోసం రూ.320 కోట్లు నిధులు ఖర్చు అవుతున్నాయని చెప్పారు. మొదటి విడతగా రూ.56 కోట్లు నిధులు ప్రభుత్వం కేటాయించిందని అన్నారు. అందులో ఇప్పటికే రూ.32 కోట్లు ఖర్చయ్యాయని పేర్కొన్నారు. పాఠశాలలో జరగుతున్న రెండో దశ నాడు-నేడు పనుల ప్రగతిని తనిఖీ కోసం వచ్చానన్నారు. పనులు త్వరగా పూర్తి చేయడానికి కృషి చేయాలని హెచ్‌ఎంను ఆదేశించినట్లు చెప్పారు. మొదటి దశ నాడు-నేడు పనుల్లో రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్నందుకు పాఠశాల బృందాన్ని డిఇఒ అభినందించారు. ఇస్కాన్ సంస్థ విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో రాళ్లు వస్తున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని, అందుకు పరిష్కార మార్గాలు అన్వేషిస్తున్నామని తెలియజేశారు. అంతకు ముందు ఆయన 10వ తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయిని జీవశాస్త్రం పాఠం బోధించడం పూర్తయ్యాక విద్యార్థులకు కొన్ని ప్రశ్నలడిగి వారి విజ్ఞాన సామర్థ్యాన్ని పరీక్షించారు. అలాగే పర్యావరణ పరిరక్షణపై పిల్లలకు పాఠం బోధించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు చెప్పే పాఠాన్ని ముందే అధ్యయనం చేసి వారికి అర్థమయ్యే రీతిలో చెప్పాలని సూచించారు. అనంతరం పాఠశాల సిబ్బందితో సమావేశం నిర్వహించి, నాడు-నేడు రెండవ దశ పనుల ఆలస్యానికి కారణాలు తెలుసుకుని, పనులు వేగవంతంగా పూర్తి కావడానికి తగిన సూచనలు, సలహాలను పాఠశాల ప్రధానోపాధ్యాయిని పద్మావతికి వివరించారు. ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, అందుకు తగ్గట్టుగా ఉపాధ్యాయులు కూడా విధుల్లో అలసత్వం చూపకుండా పిల్లలకు పాఠాలు చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి.పద్మావతి, ఉపాధ్యాయులు కృష్ణవేణి, వై.లక్ష్మీదేవి, సి.దేవకిదేవి, అలివేలు, సి.రాధ, ఎన్.ఉదయశ్రీ, వి.రాగరాణి, బి.అలివేలు, హెచ్.నాగరాణి, కె.జయలక్ష్మి, బి.లావణ్య, ఆర్.అంజలికుమారి, పి.సూర్యబేగం, ఏ.రుక్మిణిమ్మ, ఎం.శైలజ, వై.సుప్రజ, కె.భాస్కర్‌రెడ్డి, రవీంద్ర, టి.మల్లికార్జునరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ కె.రేణుక, క్రాఫ్ట్ టీచర్ పి.అరుణకుమార్, మ్యూజిక్ టీచర్ ఒడ్డిరాణి, సిఆర్‌పి నాగరాజ పాల్గొన్నారు.

నేర్చుకునేతత్వం అలవర్చుకోవాలి : చైర్‌పర్సన్ మధుబాల

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఎల్లప్పుడు నేర్చుకునేతత్వం అలవర్చుకోవాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ మధుబాల అన్నారు. 55వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలసి గ్రంథాలయం నుంచి పట్టణ పురవీ ధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాల యాల్లో మంచి మంచి నూతన విద్యా విధానానికి సంబంధించిన పుస్తకాలు లభ్యమవుతాయని, దీని వల్ల పోటీ పరీక్షలలో సులువుగా విజయం సాధించ డానికి దోహదపడుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజ శారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి రమాపతి, విద్యార్థులు పాల్గొ న్నారు. **మదనపల్లె అర్బన్:** స్థానిక శాఖ గ్రంథాలయ వారోత్సవాల భాగంగా రెండవ రోజు జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు మధుబాల ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన ప్రారంభించారు. రిటైర్డ్ కమిషనర్ సహదేవరావు అధ్యక్షతన గ్రంథాలయ అధికారి వసంత కుమారి పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ లత, సుధాకర్, బిటి కళాశాల కరస్పాండెంట్ మునిరత్నం, పాలిటెక్నిక్ కళాశాల సీనియర్ లైబ్రేరియన్ జనార్ధన్‌రెడ్డి, కృష్ణమూర్తి, తిరుపతిరావు, యుగంధర్, నాగరాజ, రెడ్డప్ప, రామచంద్ర, ప్రమీల, జయమ్మ, జ్ఞానోదయ స్కూల్ విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన పాఠకులను విద్యార్థులను ఆకట్టుకుంది. సర్పంచ్ నీలోఫర్ సరస్వతిదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. కార్యక్ర మంలో జమాల్ బాషా, ఎంపిపి స్కూల్ హెచ్‌ఎం మొగిల్లీశ్వర్, సరోజమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శాఖ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ నాయనారు మధుబాల ప్రారంభించారు.



బి.కొత్తకోట : పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ మధుబాల

కార్యక్రమంలో హౌసింగ్ సొసైటీ చైర్మన్ కంచి బలరాంరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ మాలిక్ పాల్గొన్నారు. **పీలేరు:** విద్యార్థులకు పుస్తక పఠనం చాలా మంచి అలవాటని, దాని ద్వారా ఎన్నో ఉపయోగాలున్నాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ నాయనారు మధుబాల తెలిపారు. పుస్తక ప్రదర్శన ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి విజయ కుమార్, సిబ్బంది ఫాతిమా, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రియదర్శిని, సీఎన్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. **కలకడ :**గ్రంథాలయం నందు రెండవ రోజు పుస్తక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి అమరనాథ తెలిపారు. మండలంలోని ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పుస్తక ప్రదర్శనలో పాల్గొన్నారు. **రాయచోటి:** గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని సంబేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి అన్నారు. పాఠశాలలో లైబ్రేరియన్ రెడ్డిశేఖర్ తో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మార్ల ఓబుల్‌రెడ్డి, వెంకట్రామరాజు, నబి రసూల్, సురేందర్ రాజు పాల్గొన్నారు.

గ్రామాలలో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-రామాపురం

ప్రస్తుత తుపాను ప్రభావం కారణంగా గ్రామాలలో అధికారులు ఉండాలని ప్రజలకు అందుబాటులో ఉంటూ వారిని అప్రమత్తం చేయాలని ఎంపిడిఒ హైదర్‌వలి పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం గ్రామ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం బంగాళాఖాతంలో తుపాన్ వల్ల తీవ్రత ఎక్కువగా ఉందని, వాటి ప్రభావంతో వల్లవర్షాలు అధికంగా పడే సూచనలు ఉన్నా యని పేర్కొన్నారు. గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఆ ప్రవర్తనంగా ఉండాలని తెలిపారు. నాలుగు రోజులు పాటు కురిసిన వర్షాల వల్ల గ్రామాలలో మురుగు, డ్రెయినేజీ అస్తవ్యస్తంగా మారిందని తెలిపారు. అంటువ్యాధులు ప్రమాదాలు ఉన్నందున పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. గ్రామాలలో అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత కార్యదర్శులపై ఉందన్నారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి ఉషారాణి, శివశంకర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సహకార రుణాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రజలు, రైతులు సహకార సంఘం రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో అధ్యక్షులు రామక్రిష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక బజారువీధిలోని పిఎసిఎస్ కార్యాలయం వద్ద రైతులకు, ప్రజలకు రుణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంట రుణాలు, బంగారు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు పిఎసిఎస్ ద్వారా రూ.8కోట్లు పంట రుణాలు, రూ.2.50కోట్లు బంగారు రుణాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఒకే వృత్తికి సంబంధించిన ఐదు మంది జాయింట్ లైబెల్టి గ్రూపుగా ఏర్పాటు చేసుకొని రుణాలను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి డివిజన్ కోఆపరేటివ్ అధికారి శ్యాంప్రసాద్ రెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్లు నరసింహా రెడ్డి, చంద్రశేఖర్, సిఈవో కుమార్ రెడ్డి, సిబ్బంది నారాయణ మూర్తి, మైనుద్దీన్, పద్మజ, క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సింగిల్ విండో అధ్యక్షులు రామకృష్ణారెడ్డి

టిడిపి కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ములకలచెరువు

మండలం సోంపల్లి ఎస్సీ కాలనీకి చెందిన టిడిపి కార్యకర్త బాలినేని నారాయణ మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులకు మాజీ సర్పంచ్ తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంట్ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుడి సురేష్ అతని దహన క్రియలకు 5000 ఆర్థిక సాయం అందజేశాడు. మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి వెంకట సిద్దయ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు బాలరాము, రఫి, షఫీ, బయన్న, గంగాధర్, మునేంద్ర కుమార్ పాల్గొన్నారు.

దళితులపై దాడులను అరికట్టాలి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

సమాజంలో దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి గుండ్లూరు మహేష్ అన్నారు. మంగళవారం మండలంలోని చింతపర్తిలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మాలమహానాడు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా అమ్మిటి శంకర, గౌరవ అధ్యక్షులు అవుసిలింగయ్య, ఉపాధ్యక్షులు రువేంద్ర, రమణయ్య, ప్రవీణ్ కుమార్, కార్యదర్శి ఆదినారాయణ, యర్రయ్య, పట్టణ కార్యదర్శి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి లోకేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బొప్పసముద్రం శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

శతాబ్ది వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని సుద్దమాల పంచాయతీ ఓబుల్‌రెడ్డి గారిపల్లెకు చెందిన బొమ్మిశెట్టి బుడ్డయ్య (102) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కొద్దిరోజులుగా అనారోగ్యం పాలై వయోభారంతో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు సమాచారం తెలుసుకున్న మాజీ శాసనసభ్యుడు గడికోట మోహన్ రెడ్డి ఓబుల్ రెడ్డిగారి పల్లెకు వెళ్లి మృతుని భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు బుడ్డయ్యకు తనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చి పరామర్శించారు. మండలంలో వంద సంవత్సరాల పైబడి జీవితాన్ని అనుభవించిన బుడ్డయ్య గురించి చర్చించుకుంటున్నారు

పరిహారం చెల్లింపులు వేగవంతం చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో మదనపల్లి నుంచి పీలేరు వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి ఎన్‌హెచ్ 71కు సంబంధించిన నష్టపరిహారం చెల్లింపులను వేగవంతం చేయాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మదనపల్లి నుంచి పీలేరు వరకు వాయల్పాడు, కలికిరి, మదనపల్లి, పీలేరు నాలుగు మండలాల్లోని 17 గ్రామాలలో 456.88 ఎకరాలు భూమి సేకరించామని చెప్పారు. ఇందులో భాగంగా 1921 మంది పట్టాదారులకు నష్ట పరిహారం చెల్లించాల్సి ఉండగా 255.06 ఎకరాలకు సంబంధించి 1068 మంది పట్టాదారులకు నష్టపరిహారం చెల్లించారని చెప్పారు. ఇంకా 201.81 ఎకరాలకు సంబంధించి 853 మంది పట్టాదారులకు నష్ట పరిహారం చెల్లించాల్సి ఉందన్నారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియలన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని, పనుల నిర్వహణలో నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. ఇప్పటి వరకు సేకరించిన భూములకు సంబంధించి లబ్ధిదారులకు త్వరితగతిన నష్టపరిహారం చెల్లించేందుకు ఆర్డీఓలు, తహాశీల్దార్లు కృషి చేయాలన్నారు. ప్రస్తుతం 853 ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సమావేశంలో ఎన్‌హెచ్‌ఎఐ వెంకటరమణ, రాయచోటి ఆర్డీఓ రంగస్వామి, తహాశీల్దార్లు, డిప్యూటీ తహాశీల్దార్లు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

కరాటేలో జ్ఞానాంబిక విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

ఎస్‌వి యూనివర్శిటీ నిర్వహించిన కరాటే పోటీల్లో మదనపల్లె జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారని కరస్పాండెంట్ రాటకొండ గురుప్రసాద్ తెలిపారు. ఈ నెల 14వ తేదిన ఎస్‌వి యూనివర్శిటీ పరిధిలో 250 మంది విద్యార్థులు కరాటే పోటీల్లో పాల్గొనగా తమ కళాశాలకు చెందిన చాణుక్యప్రసాద్ గోల్డ్ మెడల్, మహ్మద్ సీన్, ఫారూఖ్ సిల్వర్‌మెడల్ సాధించారన్నారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపల్ రమాదేవి, పీడీ శరత్నాయక్ అభినందించారు.

మైనింగ్ పేరుతో రైతుల కడుపు కొట్టకండి

ప్రజాశక్తి-సుండుపల్లి

మైనింగ్ లీజు పేరుతో రైతన్నల కడుపు కొట్టకండి అని వైసిపి సీనియర్ నాయకులు ఎర్రపురెడ్డి అజయ్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండంలోని మడితాడు పంచాయతీ వానరాచపల్లి బిడికి సమీపంలో ఎనము బండ వద్ద ప్రభుత్వం ఇచ్చిన మైనింగ్ లీజును వెంటనే రద్దు చేయాలన్నారు. గిరిజనులు, వడ్డెరలు భూములు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్న ప్రాంతానికి సమీపంలో ఏర్పాటు చేయడం వల్ల వారికి చాలా సమస్యలొస్తాయని తెలిపారు. రైతులకు తీరని నష్టం వాల్లితుందని చెప్పారు. రైతులు, గ్రామస్తులు వ్యతిరేకిస్తున్నా మైనింగ్ లీజును రద్దు చేయకపోవడం దారుణమన్నారు. రైతుల బాగోగులను దృష్టిలో ఉంచుకుని వెంటనే రద్దు చేయాలని, లేకపోతే సహించేది లేదని తెలిపారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

ప్రజాశక్తి-సుండుపల్లి

మాజీ ఎమ్మెల్యే రాయచోటి నియోజకవర్గం ఇన్‌ఛార్జి రెడ్డప్పగారి రమేష్‌కుమార్‌రెడ్డిపై ఉంచిన అక్రమ కేసును వెంటనే ఎత్తివేయాలని రాజంపేట ప్లామెంట ఉపాధ్యక్షులు సహాయ రెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లక్కిరెడ్డిపల్లి మండలంలో తనకు ఎటువంటి సంబంధం లేని వ్యక్తులు అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో అక్రమ కేసులు బనాయించడం సబబు కాదదన్నారు. రాయచోటి నియోజకవర్గంలో రమేష్‌కుమార్‌రెడ్డికి ఉన్న ప్రజాబలాన్ని చూసి ఓర్వలేకనే అక్రమ కేసులు పెట్టించారని తెలిపారు. అధికార పార్టీ నాయకులకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయని పేర్కొన్నారు.

దుప్పట్లు పంపిణీ అభినందనీయం : ఎస్ఐ

ప్రజాశక్తి-సుండుపల్లి

చలికాలంలో దుప్పట్లు పంచడం అభినందనీయమని ఎస్ఐ రామకృష్ణ పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం రాత్రి సంఘ సేవకులు డాక్టర్ సయ్యద్ అహ్మద్ ఆధ్వర్యంలో తన మిత్రుల సహకారంతో నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ పేదలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చలి తీవ్రత పెరిగినందున నిరాశ్రయులు చలికి ఇబ్బందులు పడుతుంటారని అలాంటి వారికి దుప్పట్లు ఇవ్వాడం గొప్పవిషయమన్నారు. ఇలాంటి బృహత్తర కార్యక్రమాలను చేస్తున్నటువంటి సంఘసేవకులు డాక్టర్ సయ్యద్ అహ్మద్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ వెంటకరమణ, బెల్లం సంజీవరెడ్డి ,అలీ, కరీముల్లా, బాబురెడ్డి, సమీర్ పాల్గొన్నారు.

'వెలుగు'ను సందర్శించిన మడకశిర మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని అమ్మచెరువుమిట్ట వెలుగు వృద్ధాశ్రమాన్ని మడకశిర మాజీ ఎమ్మెల్యే వై.టి.ప్రభాకర్‌రెడ్డి, లాయర్ రాధాకృష్ణ, మడకశిర, కాంట్రాక్టర్ సుబ్బారెడ్డి మంగళవారం సందర్శించారు. వీరికి వృద్ధులు పుష్పగుచ్ఛాలిచ్చి స్వాగతం పలికారు. అనంతరం వెలుగు సోషల్ వర్కర్ గీత వృద్ధుల గురించి, వృద్ధాశ్రమం యొక్క కార్యక్రమాలను వివరించారు. వై.టి.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఇక్కడ ఇంత మంది వృద్ధులకు సేవ చేయడం చాలా ఉన్నతమైన సేవన్నారు. ఇలాంటి వారిని చూసినపుడు మేము కూడా మా వంతు సేవ చేసుకోవాలని చెప్పారు. ఇక్కడ సదుపాయాలు చాల బాగున్నాయని చెప్పారు. భవిష్యత్తులో వృద్ధాశ్రమానికి తమవంతుగా తగిన సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఇలాంటి మంచి కార్యక్రమాలు చేస్తున్నందుకు వెలుగు సెక్రటరీ ఉదయ మోహన్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమం సూపరింటెండెంట్ ఉదయ కుమార్‌రెడ్డి, సిబ్బంది, వృద్ధులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

వాల్మీకిపురం: వివిధ రకాల పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతులు, సమగ్ర సస్యరక్షణ, నివారణ చర్యలు తీసుకోవడం వలన మంచి దిగుబడులు సాధించవచ్చునని జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ శ్రీకాంత్, కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త పీర్ సాహెబ్ అన్నారు. మంగళవారం మండలంలోని మూరేవాండ్లపల్లిలో రైతులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి, వేరుశనగ, మామిడి, బొప్పాయి పంటల యాజమాన్య పద్ధతులపై వివరించారు. అలాగే వరిలో పొటాష్ తప్పకుండా వాడాలని, యూరియాను అధికంగా వాడడం వలన చీడపీడల సమస్యలు అధికమౌతాయన్నారు. గుళిక రూపంలో ఉండే యురియకు బదులుగా నానో యూరియాను పైపాటుగా ఆకుపై పిచికారి చేస్తే కొంతమేర దిగుబడి పెరుగుతుందని సూచించారు. మామిడిలో ఫ్రూట్ కవర్స్ వాడడం వలన నాణ్యమైన కాయలు పొంది, మంచి గిట్టుబాటు ధరకు అమ్ముకునే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం బొప్పాయి పంటలోని ఆకుమడత, రింగ్ స్పాట్ వలన కలిగే నష్టాలు, వాటి నివారణ చర్యలను వివరించారు. ప్రస్తుత రబీ సీజన్‌లో టిసిజిఎస్ 1694 వేరుశెనగ విత్తనాలను సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎఒ హేమలత, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ పెద్ద రెడ్డెప్ప రెడ్డి, అగ్రి సలహా మండలి కన్వీనర్ వేమనారాయణ రెడ్డి, విఎఎ శివకుమార్, రైతులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలో రూ.లక్ష రికవరీ

తంబళ్లపల్లి : మండలంలో 12 రోజులుగా జరిగిన సామాజిక తనిఖీ బృందం గుర్తించిన అంశాలను మంగళవారం ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో జరిగిన ప్రజా వేదికలో వెల్లడించారు. ఉపాధి హామీ డిడి మద్దిరెడ్డి, ఎపిడి నందకుమార్ రెడ్డి, ఎస్ఆర్‌పి సూర్యచక్రం సమక్షంలో టిఆర్పీలు గ్రామాల వారి తనిఖీల్లో గుర్తించిన అంశాలను బహిర్గతం చేశారు. 13 గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవకతవకల ద్వారా సుమారు రూ.40,378 ఆదేశించారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన సీసీ రోడ్ల నిర్మాణాలలో సిమెంట్ వేస్ట్ చేయడంపై వేస్ట్ అయినా విషయాన్ని గుర్తించారు. ఇందుకు సుమారు రూ.67,210 రికవరీ చేయాల్సిందేనని ఆదేశించారు. అనంతరం జరిగిన సమావేశంలో డిడి మాట్లాడుతూ ఉపాధి హామీ సిబ్బంది విధి నిర్వహణలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. గ్రామాలలో కూలీలు కోరిన పనులు చూపి పనుల్లో అత్యధికంగా కూలీలు పాల్గొనే విధంగా ఎఫ్ఏలు, డిఎలు సమిష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నీలుఫర్, ఎంపిడిఒ ఆనంద్ కుమార్, ఏపీవో మాధవి పాల్గొన్నారు.

హెల్త్ సెంటర్ పనులు పరిశీలన

ములకలచెరువు: మండలంలోని పాతములకల చెరువు పంచాయతీలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఆదేశాలతో ప్రజల అవసరాల మేరకు రూ.17.50 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న హెల్త్ సెంటర్ నిర్మాణ పనులను పిఆర్ ఎఇ అనిత పరిశీలించారు. ఆమె వెంట కాంట్రాక్టర్ రెడ్డప్పరెడ్డి ఉన్నారు.